క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు



గుంటూరు మెడికల్: కోస్టల్ బ్యాంక్ బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్‌లో బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా గురువారం గుజ్జనగుండ్ల ప్రజా వైద్యశాల డాక్టర్ శేషయ్య సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ భవిష్యత్తులో మరిన్ని మైలురాయిలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందజేయాలని సూచించారు. బ్యాంకు యాజమాన్యానికి, సిబ్బందిని అభినందించారు. శిబిరంలో ఆయనతో పాటు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శివశంకరయ్య, ఫార్మసిస్ట్ కె.వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ శేషు, కోస్టల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ షేక్ గౌస్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు బెదిరింపులు

లక్ష్మీపురం: కారును తనఖా పెట్టి తీసుకున్న రూ.1.30లక్షలు అప్పును చెల్లించమని కోరగా బెదిరింపులకు దిగిన ఘటన పై పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుఫాన్ నగర్‌కు చెందిన షేక్ ఖాసీం సైదా ఓ కన్సల్టెన్సీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 19న గోరంట్ల మాలకొండయ్య అలియాస్(టెంపర్ ఎం.కె) ఖాసీం సైదా వద్దకు వచ్చి అత్యవసరంగా నగదు కావాలని కారును పెట్టి రూ.1.30 లక్షలు తీసుకుని వెళ్ళాడు. కొన్ని రోజుల తరువాత కారు అసలు యజమాని తేజ వచ్చి మాలకొండయ్య తన వద్ద కారు అద్దెకు తీసుకున్నట్లు చెప్పి సంబంధిత పత్రాలను చూపించి తీసుకు వెళ్లిపోయాడు. దీంతో ఖాసీం సైదా మాలకొండయ్య వద్దకు వెళ్లి డబ్బులు వాపసు చేయాల్సిందిగా కోరడంతో బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు ఖాసీం సైదా దిక్కుతోచక పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అయ్యప్ప స్వామి దేవాలయంలో పడిపూజ

గుంటూరు వెస్ట్: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 5/7 బ్రాడీపేట అయ్యస్వామి దేవాలయంలో శుక్రవారం పలు పూజలు జరుగుతాయని నిర్వాహకులు భావన్నారాయణ, అయితి సతీష్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పడిపూజను గురుస్వాములు అంబటిపూడి భానుమూర్తి సోమయాజులు, పోతురాజు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. స్వాములకు మధ్యాహ్నం భోజనంతో పాటు రాత్రి కూడా ఫలహారాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాత్రి 8: 30 గంటలకు పడి పూజతోపాటు సినీ సంగీత దర్శకుడు ఓరుగంటి ధర్మతేజ బృందంతో భక్తిగీతాలు, భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని వారు కోరారు.

ఆలయాల హుండీ కానుకల లెక్కింపు



పట్నంబజారు: లాలాపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి, నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయ స్వామి, కొత్తపేటలోని శ్రీజగన్నాథస్వామి గ్రూపు ఆలయాల హుండీ కానుకులను గురువారం లెక్కించారు. గ్రూపు ఆలయాల అసిస్టెంట్ కమిషనర్ పి.సుభద్ర ఆధ్వర్యంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.సి.హెచ్.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఆలయాల బోర్డు చైర్మన్ సూరినేడి దుర్గాప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శ్రీసద్గురు సేవా సమితి సభ్యుల సహకారంతో నిర్వహించారు. ఇందులో లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ. 4,77,915, ఆంజనేయ స్వామి దేవస్థానానికి రూ. 3,12,797, జగన్నాథస్వామి ఆలయానికి రూ. 7,589 కలిపి మొత్తం రూ. 4,98,301 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సఖి వన్ స్టాప్ సెంటర్ తనిఖీ

నెహ్రూనగర్: మహిళా ప్రాంగణంలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఏపీ మహిళా కమిషన్ మెంబర్ బూసి వినీత గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలో బాధితులకు అందుతున్న సహాయం, రికార్డ్స్, షెల్టర్ రూమును పరిశీలించారు. అనంతరం గొడవల పడి కేంద్రానికి వచ్చిన భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె. శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న డీ మణికంఠ డ్యాన్సర్లు





భారతీయ సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న కళాకారులు

• జిగేల్... జిగేల్ !

శ్రీ వేంటేశ్వర విజ్ఞాన మందిరంలో సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కల్చరల్ నైట్ ఆద్యంతం హుషారుగా సాగింది. డ్యాన్సర్లు నృత్యాలతో వేదికను అదరగొట్టేశారు. ఉత్సాహం ఉప్పొంగింది. స్టెప్పులకు యువత వెర్రెక్కి పోయింది. ఆవరణంతా సందడి నెలకొంది.

– సాక్షి, గుంటూరు ఫొటోగ్రాఫర్

రాష్ట్ర రాజకీయాల్లో మహోజ్వల శక్తి రంగా

నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: రాష్ట్ర రాజకీయాలలో వంగవీటి మోహన రంగా మహోజ్వల శక్తి అని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని పాత గుంటూరులోని బాలాజీ నగర్, శ్రీనివాసరావు పేట అచ్చయ్య ధాబా సెంటర్‌లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రంగా నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ, ప్రజల మనిషిగా ఎదిగారని పేర్కొన్నారు. మోహన రంగా ఒక కులానికో లేక ఒక వర్గానికో చెందిన వ్యక్తి కాదని, అణగారిన, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలవరపు వెంకటేశ్వరరావు, గేదెల రమేష్, తోట ఆంజనేయులు, అల్లం అంకమ్మరావు, సాధం కోటేశ్వరరావు, తిరుమలశెట్టి మోహన్‌రావు, అల్లం గోపి,తుమ్మల రవి, మస్తాన్, శివయ్య, చిన్న, జస్వంత్, రమణ, రామకృష్ణ, దళవాయి పుష్ప, కాపు నాయకులు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

పట్నంబజారు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కొనియాడారు. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో రంగా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యర్రబాబు, పసుపులేటి రామయ్య, నారకట్ల శ్రీనివాస్, అగ్గిపెట్టు రాజు, రామనబోయిన అజయ్‌యాదవ్, తుమ్మేటి శ్రీను, యాట్ల రవి, నందేటి రాజేష్, జాఫర్‌ఖాన్, అవుట కోటేశ్వరరావు, రాందాస్, షంషేర్, రవిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, చంటి, సాంబ, స్వర్ణ, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



రంగా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నూరిఫాతిమా, నేతలు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి

లక్ష్మీపురం: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం స్వర్గీయ వంగవీటి మోహన్‌రంగా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అవిరళ సేవలు అందించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా రంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గద్దం పాల్ నేతలు పాల్గొన్నారు.

• పాత గుంటూరులోని ఆంజనేయస్వామి గుడి వద్ద కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు మస్తాన్ వలి ఆధ్వర్యంలో మోహన్‌రంగా వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలు నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

అంతరాలు లేని సమ సమాజమే అంతిమ లక్ష్యం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

లక్ష్మీపురం: అంతరాలు లేని సమసమాజ స్థాపన ధ్యేయంగా పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక అశోక్ నగర్ సీపీఐ శాఖ ఆధ్వర్యంలో గురువారం పార్టీ శతవార్షికోత్సవాల్లో భాగంగా ఆకిటి రామచంద్రుడు అధ్యక్షతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్య పరిచి అలుపెరగని వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘనచరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో అంతరాలు లేని సమాజం కోసం, ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. దున్నేవాడిదే భూమి అని నినాదంతో ప్రజలను చైతన్యపరిచి లక్షలాది ఎకరాలను పంచిన చరిత్ర పార్టీకి మాత్రమే దక్కుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, జాతీయ కార్యదర్శి గని, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కేవీబీ మురళీకృష్ణ, పెద్ది శ్రీనివాసరావు, పీటీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శశి పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఆన్‌లైన్ మోసంతో నగదు చోరీ

లక్ష్మీపురం: ఆమెజాన్‌లో ఆర్డర్ పెట్టి అది నచ్చక తిరిగి పంపించే పద్ధతి కోసం ఆన్‌లైన్‌లో ఓ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగా విడతల వారీగా ఖాతాలోంచి రూ.29,900 చోరీ జరిగింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్తంభాల గరువు అంజిరెడ్డి వీధి ప్రాంతానికి చెందిన ఉస్మాన్ సయ్యద్ ఆన్‌లైన్ ఆమెజాన్‌లో ఒక వస్తువును ఆర్డర్ చేశాడు. వస్తువు ఇంటికి వచ్చిన తరువాత తీసి చూసేసరికి అనుకున్న స్థాయిలో లేకపోవడంతో తిరిగి పంపించడం అర్థం కాలేదు. దీంతో గూగుల్ హెల్ప్‌లైన్ నంబర్ 756979578 నంబర్‌కు ఫోన్ చేశాడు. ఆ నంబర్‌గల వ్యక్తి వస్తువును ఎలా తిరిగి పంపించాలో చెప్పడం ప్రాంభించాడు. అలా చెబుతున్న సమయంలో బాధితుడు ఉస్మాన్ సయ్యద్ బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.29,900 నగదు కట్ అయింది. దీంతో బాధితుడు తిరిగి హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదు. దిక్కుతోచక ఉస్మాన్ సయ్యద్ పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెండి తెరకు వాస్తవికత అద్దిన శ్యామ్ బెనెగల్



లక్ష్మీపురం: మట్టి మనుషుల జీవిత గాథలతో వెండి తెరకు కొత్త సొబగులు అద్దిన శ్యామ్ బెనెగల్ మరణంతో భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఒక అధ్యాయం ముగిసిందని సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎస్. మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో ఆకాశపు హద్దులు దాటే బాలివుడ్ చిత్రాలను శ్యామ్ బెనెగల్ నేలకు దించారని తెలిపారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకులు రామకృష్ణారెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యంత భృతి ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమించి, మధ్యంత భృతి ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు కోరారు. ఈ మేరకు గురువారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. నూతన సంవత్సర కానుకగా మధ్యంతర భృతి, డీఏ ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్‌టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. సాయి విశ్వనాథ్, పి. లలితబాబు, అదనపు కార్యదర్శి టి. శ్రీనివాస్ ఉన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ మినిస్టీరియల్ హాలులో పనిచేస్తున్న మాటలు రాని యువకుడు భూపతి ఇటీవల కిడ్నీ వ్యాధి సోకి ఆసుపత్రిలో చేరాడు. కొద్దిరోజుల చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, జూనియర్ అసిస్టెంట్ జి.నాగరాజు రూ. 25వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఒప్పందాల జీవోలను వెంటనే విడుదల చేయాలి

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

నెహ్రూనగర్: గత 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలకు వెంటనే జీవోలు జారీ చేయాలని జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులతో కలసి గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు 16 రోజులు సమ్మె జరిగిందని తెలిపారు. ఈ సమయంలో ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో ఒప్పందాలు చేసుకుందని చెప్పారు. సంవత్సరం అవుతున్న ఇంతవరకు జీవోలు జారీ చేయకపోవడం కార్మికులను మోసగించడమేనని తెలిపారు. రిటైర్మెంట్ చేసిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు 10 సంవత్సరాలు సర్వీస్ ఉన్నవారికి రూ. 75 వేలు, ఆ పైన సర్వీసు ఉన్న వారికి సంవత్సరానికి రూ. 2 వేలు కలిపి చెల్లిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి నష్టపరిహారం రూ. 7 లక్షలకు పెంచుతామని, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు దహన సంస్కార ఖర్చులు రూ. 20వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇవి నేటికీ హామీలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలకు 9 మంది ఐఏఎస్ అధికారులతో కమిటీ వేశారని, ఆ కమిటీ రిపోర్ట్ ఏమైంది ? అని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు నగరపాలక సంస్థలో గత 10, 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న బదిలీ పారిశుద్ధ్య కార్మికులను రోజువారి మాస్టర్ కార్మికులుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించి మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ధర్నా అనంతరం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుంభా శివయ్య, కాళంగి భాగ్యరాజు, కారసాల శౌరమ్మ, పచ్చల సామ్రాజ్యం, షేక్ రసూల్, అబ్దుల్ హలీమ్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, సురేష్, భూలక్ష్మి, మీసాల వెంకటేశ్వర్లు, ఝాన్సీ పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదురు నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రయాణికురాలిని బెదిరించి దారి దోపిడీ

చేబ్రోలు: ఆటోలో మహిళా ప్రయాణికురాలిని బెదిరించి ఆమె నుంచి బంగారం, నగదు, ఫోన్‌ను అపహరించుకుపోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ గురువారం తెలిపారు. తెనాలి ప్రాంతానికి చెందిన యువతి గుంటూరులోని ఆటోమొబైల్ కంపెనీలో పని చేస్తోంది. 24వ తేదీ సాయంత్రం ఆఫీసులో పని ముగించుకొని తెనాలిలోని ఇంటికి వెళ్లటానికి బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్దకు చేరుకుంది. కొద్దిపాటి వర్షం పడుతుండటంతో తెనాలి వెళ్తున్న ఆటోలో బయలు దేరింది. మార్గం మధ్యలో నారాకోడూరు గ్రామ సమీపంలోని కారం మిల్లు వద్దకు వచ్చే సరికి ఆటో డ్రైవర్‌తో పాటు అందులోనే ఉన్న మరో వ్యక్తి వర్షం పడకుండా పట్టా అడ్డు కడుతున్నట్లు నటిస్తూ వేజెండ్ల వెళ్లే డొంక రోడ్డులోనికి పోనిచ్చారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, బ్యాగ్, సెల్‌ఫోన్‌ను లాక్కోవటంతో బలవంతంగా ఆటో దూకి జీబీసీ ప్రధాన రహదారి మీదకు చేరుకుంది. అక్కడ రాకపోకలు సాగించే వారికి సమాచారం తెలియజేయడంతో పాటు డయల్ 100కు ఫోన్ చేసి దొంగతనం సమాచారాన్ని తెలిపింది. నారాకోడూరు ట్రాఫిక్ డ్యూటీలో ఉన్న ఎస్ఐ డి. వెంకటకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆటోలో పరారవుతున్న వారిని వెంబడించారు. వారు పొలాల్లోకి ఆటోను పోనిచ్చి అక్కడ నుంచి వారు తప్పించుకొని పరారయ్యారు. ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆటో నంబరు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఇద్దరూ నారాకోడూరు, పాతరెడ్డిపాలేనికి చెందిన వారిగా గుర్తించారు. అదుపులోకి తీసుకొని వారిని అరెస్ట్ చేయడానికి పోలీసులు గాలిస్తున్నారు. యువతి ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ డి. వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప ఆలయంలో వైభవంగా మండల పూజ



పంచామృతాలతో స్వామికి అభిషేకం



హోమంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డి నగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో 14వ మండల పూజ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అష్ట ద్రవ్య గణపతి హోమం, నవకలశారాధన, అయ్యప్ప స్వామికి మహాకలశాభిషేకం, హోమం, పూర్ణాహుతిని ఆలయ పూజారులు శివకుమార్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలాధారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం గురుస్వామి కె.రాము (విజయవాడ) ఆధ్వర్యంలో పదునెట్టాంబడి పూజ, మార్కాపురం శ్రీనుస్వామి భజన నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామికి కన్నుల పండువగా పుష్పాభిషేకం, మహా హారతి జరిగాయి. రాత్రి భిక్షతో ముగిసింది. కార్యక్రమంలో ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధన మేరకు నిర్మాణాలు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: బహుళ అంతస్తుల భవనాలు నిబంధన మేరకు నిర్మాణాలు చేపట్టాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైయిన్లపై నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. డ్రైనేజీ లైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఆయన గురువారం గోరంట్లలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లు, డ్రైయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తర్వాత అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవనాలు నిర్మాణ దశలోనే వార్డ్ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకపోతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైయిన్లపై ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మేన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీప్లానర్ మల్లికార్జున, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



భవన కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలి

నెహ్రూనగర్: రోజురోజుకీ పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గురువారం కేటీపీ ఫౌండేషన్ ఈ-వ్యర్థాల నిర్వహణపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణలో కేటీపీ ఫౌండేషన్ కృషి అభినందనీయమని తెలిపారు. రతన్ టాటా జయంతి సందర్భంగా ఈనెల 28న బృందావన్ గార్డెన్స్‌లోని క్రోమా షోరూమ్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అందిస్తే కేటీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి పేరుతో ఒక మొక్కను నాటి, ఈ-సర్టిఫికెట్ అందిస్తారని తెలిపారు. నగర ప్రజలు తమ ఇంటిలో వినియోగంలో లేని మొబైల్స్, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అందించి పర్యావరణ పరిరక్షణలో భాగాస్వాములు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో కేటీపీ ఫౌండేషన్ చైర్మన్ బి.నిశ్చల్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత విజ్ఞాన ప్రదర్శన



గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గురువారం గణిత విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్, బ్రహ్మగుప్త, భాస్కరాచార్య, శకుంతలాదేవి ఆవిష్కరించిన గణిత నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. గణిత పార్కు, గణిత హౌస్, గణిత ఫజిల్స్, రీజనింగ్ తదితర ఎన్నో రకాల మాథమాటిక్స్ నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జి. కొండారెడ్డి, జి. జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.